# 179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

## చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెకార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

### వేలం వేసిన ఖనిజాల వివరాలు

| ఖనిజం | వేలం వేసిన బ్లాకులు | టీక్యూబీల సంఖ్య | రిజర్వు ధర (రూ.) | తుది బిడ్ మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| కలర్ గ్రానైట్ | 1 | 5 | 29,04,000 | 4,99,79,000 |
| లాటరైట్ | 4 | 39 | 63,33,600 | 15,89,58,600 |
| స్టోన్ అండ్ మెటల్ | 14 | 84 | 4,71,25,000 | 35,84,75,000 |
| మొత్తం | 19 | 128 | 5,63,62,600 | 56,74,12,600 |

# గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.



# పారిశ్రామికానికి బీటలు

## ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి

- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి

న్యూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే డీలాపడింది. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతోపాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

### డీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

### క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్వాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్జ్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.

### కీలక రంగాలది అదే దారి

కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.



**పారిశ్రామిక ప్రగతి**
2.7% ఏప్రిల్-2025 | 5.2% ఏప్రిల్-2024

**తయారీరంగ వృద్ధి**
3.4% ఏప్రిల్-2025 | 4.2% ఏప్రిల్-2024

**గనుల రంగ వృద్ధి**
-0.2% ఏప్రిల్-2025 | 6.8% ఏప్రిల్-2024

**విద్యుత్ రంగం**
1% ఏప్రిల్-2025 | 10.2% ఏప్రిల్-2024

**ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం**
4% ఏప్రిల్-2025 | 8.5% ఏప్రిల్-2024

**ప్రాథమిక వస్తువుల అవుట్‌పుట్**
-0.4% ఏప్రిల్-2025 | 7% ఏప్రిల్-2024

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకానుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదంతొక్కాయి. బ్రిటిష్ మల్టీనేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్ఇండ్, నెస్లె, అల్ట్రాటెక్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.




## డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాము పొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంద్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

# ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

**2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం**






న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

### ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

రామగిరి మే 28: డిజిటల్ పట్టా పాస్ బుక్ కలిగిన ప్రతి రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని రామగిరి ఏవో చిందం శ్రీకాంత్ తెలిపారు.బుధవారం బేగంపేట గ్రామంలో ఫార్మా రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ కార్యక్రమంలో ఏఈవోలు నవీన్ అరవింద్ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

**రైతుల నుంచి స్పందన**

ఎలిగేడు,మే 28 ః ఫార్మర్ రిజిస్ట్రీ కి రైతుల నుండి విశేష స్పందన లభిస్తుందని ఏఈఓ సురేష్ తెలిపారు. బుధవారం ర్యాకల్‌దేవ్‌పల్లిలో నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని రైతుల గుర్తింపు కార్డులకోసం నమోదు చేసుకున్నారన్నారు. మిగతా రైతులు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎలిగేడు : వివరాలు నమోదు చేసుకుంటున్న రైతులు

## ఆవిర్భావ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, మే 28 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను బుధవారం రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కే నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఏరియా ఇంజినీర్ వైవీ శేఖర్ బాబు, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బీ సుదర్శనం, ఎలక్ట్రికల్ డీవైఎస్ఈ సంజీవ్ కుమార్, అధికారులు సునిల్ ప్రసాద్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## పోరాటయోధుడు మునీర్

యైటింక్లయిన్‌కాలనీ, మే 28 : ప్రజల కోసమే జీవితాంతం పరితపించిన పోరాట యోధుడు మునీర్ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కొనియాడారు. బుధవారం రాత్రి టీబీజీకెఎస్ కార్యాలయంలో మునీర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మునీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో తెలంగాణ అప్పటి ఉద్యమ సారథి కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో సింగరేణి బొగ్గు గని కార్మికులందరిని ఏకతాటిపై తీసుకవచ్చి సకల జనుల సమ్మెను విజయవంతం చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రాంమూర్తి, ఆర్జీ-2 ఉపాధ్యాక్షుడు ఐలి శ్రీనివాస్, కొదాటి శ్రీనివాస్ రావు, సంపత్ రెడ్డి, నాగెల్లి సాంబయ్య, వడ్డేపల్లి శంకర్, బేతి చంద్రయ్య, కూర తిరుపతి, సురేందర్, ధరణి మల్లేశ్వర్‌రావు, దాసరి శ్రీనివాస్, తిరుపతి, లింగారెడ్డి పాల్గొన్నారు.



మునీర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## సింగరేణి తవ్విన కాలువతో విద్యార్థులకు ప్రమాదం

రామగిరి,మే 28 : రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో సింగరేణి తవ్విన కాలువతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్జీ-3,అడ్రియాల జీఎం కొలిపాక నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఎంఈఓ (ఎం.ఆర్.సి) కార్యాలయం మధ్యన చిన్న వాగు ఉండగా దీనిని ఇటీవల సింగరేణి అధికారులు జేసీబీతో పెద్దకాలువ (నాలా) గా తవ్వించారు. ఇది ప్రభుత్వ పాఠశాలకు అతి సమీపంగా ఉండడంతో విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందని, సేఫ్టీ వాల్ నిర్మించాల్సి ఉండగా నింబధనలకు విరుద్ధంగా త్రవ్వకం చేపట్టినట్లు భారీగా వరదనీరు ప్రవహించే సమయంలో విద్యార్థులు ఇందులో పడిపోయే ప్రమాదం పొంచి ఉందిని అధికారులు తక్షణమే పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థులకు ఎలాంటి హాని జరిగిన సింగరేణి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.



పిచ్చికుక్కల దాడిలో గాయపడిన బాలుడు

## చిన్నారులపై పిచ్చి కుక్కల దాడి

ముత్తారం, మే 28: ముగ్గురు చిన్నారులతో పాటు ఓ మహిళ పై పిచ్చి కుక్కలు దాడి చేసిన సంఘటన మండలంలోని ఖమ్మంపల్లి లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కళవేన వెంకటేశ్ కుమారుడు మనువర్షి (4), కటకం పోచయ్య కుమార్తె స్వేచ్ఛ శ్రీ (4), మంథని కుమార్ కుమారుడు అషువర్ధన్ (5) ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. అలాగే చింతం కొమురక్క పై కూడా దాడి చేశాయి, దింతో హుటాహుటిన వీరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వేచ్ఛశ్రీకి గాయాలు ఎక్కువ కావడం తో మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని ఆసుపత్రి కి తరలించారు. కొన్ని రోజులుగా గ్రామంలో పిచ్చి కుక్కలు రాత్రి పగలు తేడా లేకుండా దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని సార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల భారీ నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఐఎఫ్‌టీయూ ధర్నా

రామగిరి, మే 28: మారుపేర్లు విజిలెన్స్ కేసులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సింగరేణి ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ మాట్లాడుతూ అనేక యేళ్లుగా విజిలెన్స్ వద్ద పెండింగ్‌లో ఉన్న మారు పేర్లు, ఇతర అన్ని కేసులను యాజమాన్యం పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. మారుపేర్ల బాధితుల సమస్యలను పరిష్కరించి వన్ టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఎంకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు ఏ.వెంకన్న, ఇ.నరేశ్, అశోక్, రాజేశం, తొట్ల రాయమల్లు, సతీశ్, రాజశేఖర్, శ్రావణ్, సుధాకర్, వెంకన్న, తిరుమల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామగిరి, మే 28: పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ డైరెక్టర్ కె.తరుణ్ కుమార్ అన్నారు. రామగుండం -3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా జీఎం కార్యాలయం ఆవరణలో పర్యావరణ వక్షోత్సవాల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జీఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు ఉద్యోగులకు జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. అనంతరం ఓసీపీ-1 ఉపరితల గని రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా జూలపల్లి, ముల్కలపల్లి, పన్నూర్, రత్నాపూర్, నాగేపల్లి గ్రామాలలో చేపట్టిన చెక్ డ్యామ్‌లు, సీసీ రోడ్లు, సోలార్ లైట్లు, ఇంకుడు గుంతలు, బస్ షెల్టర్లు, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఓసీపీ-1 ఉపరితల గని లోని వ్యూ పాయింట్, పండ్ల మొక్కల పెంపకం, విండ్ బ్యారియర్, గ్రీన్ బ్యారియర్, ఎస్టీపీ ప్లాంట్ పరిశీలించారు. ఓసీపీ -1 రెమిడేషన్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన పనుల వివరాలను రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కే నాగేశ్వరరావు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎన్విరాన్మెంట్ విభాగం జనరల్ మేనేజర్ సైదులు, ఎస్వోటూ జీఎం ఎం రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ వైవీ శేఖర్ బాబు, ఫైనాన్స్ ఏజీఎం పీ శ్రీనివాసులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ జే రాజశేఖర్, ఎన్వీరాల్‌మెంట్ డీజీఎంలు పీ రాజారెడ్డి, కిషన్, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బీ సుదర్శనం, ఫారెస్ట్రీ విభాగాధిపతి కల్యాణ్, కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం అధికారులు సీహెచ్. శ్రీనివాస్ రవి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్జీ-2 లో పర్యటన**

యైటింక్లయిన్‌కాలనీ, మే 28 : ఆర్జీ-2 ఏరియాలో కేంద్ర పర్యావరణ డైరెక్టర్ శాస్త్రవేత్త కే. తరుణ్‌కుమార్ కత్తుల పర్యటించారు. ఏరియా జీఎం బండి వెంకటయ్య, సింగరేణి పర్యావరణ జీఎం సైదులతో కలిసి వకీలుపల్లి గనితోపాటు ఏరియా ప్రభావిత గ్రామాలైన వకీలుపల్లి, పెంచికల్‌పేట, న్యూపెద్దంపేట, న్యూమారేడుపాక, చందనాపూర్ గ్రామాల్లో సింగరేణి యాజమాన్యం చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వీకేపీ ఏజెంట్ నేహ్రూ, మేనేజర్ రవికిరణ్, పర్యావరణ అధికారులు సీహెచ్. శ్రీనివాస్, సురేష్‌బాబు, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## చిన్న వర్షానికే ఇళ్లలోకి చేరుతున్న వరద

మంథని, మే 28: చిన్న వర్షానికే ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి మంథని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో దొంతులవాడ, భగత్ నగర్ , రావుల చెరువుకట్టలతో పాటు సత్యసాయినగర్ , పద్మశాలివీధితో పాటు పలు వీధుల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఆందోళన చెందారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా మంథని పట్టణంలోని అన్ని వార్డుల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టిన విషయం విధితమే. అయితే అండర్ డ్రైనేజీ నిర్మాణ సమయంలో కొన్ని వార్డుల్లో పెద్ద పైపులు, మరికొన్ని వార్డుల్లో చిన్న పైపులను వేసి పనులు నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు సాంకేతిక తప్పిదం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో నిర్వహించిన పనులు పట్టణ ప్రజలకు శాపంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. అండర్ డ్రైనేజీలు చిన్న పైపులతో నిర్మించడంతో వర్షపు నీరు రోడ్లపైకి పారి ఆయా వార్డుల్లో ఉన్న ఇళ్లలోకి చేరుతుంది. కేవలం ఈ చిన్న వర్షానికే ఇలాంటి పరిస్థితి ఉంటే రానున్న వర్షాకాలంలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో ఏంటో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన మంథనిలో కాంట్రాక్టర్ ఇలా ఇష్టా రాజ్యం పనులు నిర్వహించడం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలం ప్రారంభం కాక ముందే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇండ్ల మధ్య నిలిచిన నీరు

## ఎన్టీఆర్ జయంతి

జ్యోతినగర్(రామగుండం), మే 27: మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని రామగుండంలోని తబితా ఆశ్రమంలో ఎన్టీఆర్ అభిమాని, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లలతో కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఇక్కడ సినీహీరో బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు జనగామ తిరుపతి, నాయకులు సిరికొండ కోటి, ఎస్‌కె బాబుమియా, రోహిత్, తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి


సుల్తానాబాద్, మే 28 : పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌తో కలిసి తెలంగాణ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీరితో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

## పంటల ఆధునిక పద్ధతులు పాటించాలి

ఓదెల, మే 28: పంటల సాగులో రైతులు ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కోరారు. బుధవారం జీలకుంట గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. రైతులు వ్యవసాయ సాగులో వస్తున్న ఆధునిక పద్ధతులకు ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, రసాయనిక పురుగల మందుల వినియోగాన్ని కూడా తగ్గించుకోవడం మంచిదని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో దుకాణాదారుడి నుంచి రశీదు తప్పనిసరి తీసుకుని భద్రపర్చుకోవాలని తెలియజేశారు. వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవడం ద్వారా నీరు అవసరం ఎక్కువగా ఉండదన్నారు. వ్యవసాయ సాగులో మెళుకవలను వివరించారు. సాగు పద్ధతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఇక్కడ కునారం, కరీంనగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు శ్రీధర్, గాయత్రి, అధికారులు శ్రీనాథ్, మహేశ్, మౌనిక పాల్గొన్నారు.

## దుమ్ము లేపుతున్న దుబ్బ లారీలు

- అడ్డుకున్న ముత్తారం గ్రామస్తులు



లారీల రాకపోకలతో లేస్తున్న దుమ్ము

ముత్తారం, మే 28: గతంలో వరదల వల్ల మండలంలోని ఓడేడు గ్రామంలో మానేరు పరీవాహక ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఇసుకమేటలు పెట్టింది. ఇసుకమేటలను తరలించేందుకు కొందరు దళారులు పర్మిషన్ పేరుతో గత రెండు రోజులుగా అధిక లోడ్ తో వందలాది లారీల్లో ఇసుక మేటలను తరలిస్తున్నారు. 25మెట్రిక్ టన్నులకు పర్మిషన్ తీసుకొని సుమారు 40 నుంచి 50 మెట్రిక్ టన్నులతో అధిక లోడ్లతో వెళ్తున్న కారణంగా రోడ్లపై దుమ్ము లేచి వాహన దారులు, రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధిక లోడ్ నివారించాలని మండల కేంద్రంలో గ్రామస్తులు లారీలను అడ్డుకొని నిరసన తెలిపారు. అధిక లోడ్ తో ప్రమాద కరంగా దుబ్బను తరలిస్తున్న లారీ అదుపు తప్పి రోడ్డుకు ఒక వైపు ఒరిగింది. ఈ సమయంలో అటుగా ఎలాంటి వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది. అధిక లోడ్‌లతో పాటు లారీ డ్రైవర్లు వేగంగా వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవునతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని భయాందోళన చెందుతున్నారు.

## కార్మికుల సంక్షేమానికి కృషి

గోదావరిఖని, మే 28: సింగరేణిలో కార్మికవర్గం సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని అ యూనియన్ ఉప ప్రధానకార్యదర్శి ముస్కె సమ్మయ్య, వైవి రావులు పేర్కొన్నారు. బుధవారం ఆర్జీ-3 ఏరియాలోని ఏఎల్‌పీ గనిలో ఫిట్ సెక్రటరీ గంగాధర్ అధ్యక్షతన జరిగిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఇప్పటికి వరకు కార్మికుల అనేక సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేసినట్లు వివరించారు. ఇక్కడ ఏఐటీయూసీ నాయకులు జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, నర్సింగరావు, క్రాంతి, తదితరులు ఉన్నారు.